క్లుప్తంగా

పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్

తిరువూరు: పట్టణంలో ఆస్తి పన్ను బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. పాత బకాయిలు రూ.1.30 కోట్లకు పైగా వసూలు కావలసి ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రూ.2,12,63,000 పన్నులకు డిమాండ్ నోటీసులు జారీచేశామని పేర్కొన్నారు. పట్టణంలో నగర పంచాయతీ కూరగాయల మార్కెట్ దుకాణ సముదాయం, సుంకర వీరభద్రరావు కాంప్లెక్స్, పశువుల సంత, ఆశీలు పాటలకు మార్చి నెలాఖరులోపు వేలం నిర్వహిస్తామని తెలియజేశారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



గంపలగూడెం: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఉన్న ఐటీసీ పెట్రోల్ బంకులను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఐటీసీ సేల్స్ ఆఫీసర్ వరప్రసాదరావు, తిరువూరు పీడీఎస్‌డీటీ నాగరాజు గంపలగూడెం, తోటమూల, కొణిజెర్ల గ్రామాల్లోని ఐటీసీ బంకులను తనిఖీ చేసి, ఆయా బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు, రికార్డులను క్వాలిటీ, క్వాంటిటీలను పరిశీలించారు. వాహనదారుల సౌకర్యార్థం తప్పనిసరిగా మరుగుదొడ్లు, గాలి మిషన్లను అందుబాటులో ఉంచాలని బంకు యాజమానులకు సూచించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభించిన జెడ్పీ వైస్ చైర్మన్

ఇబ్రహీంపట్నం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మన ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు జరగాలని ఆమె సూచించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకుండా క్రీడల్లో రాణించాలన్నారు. రెండురోజుల పాటు డే అండ్ నైట్ మ్యాచ్‌లు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మతగురువు మహ్మద్ ఆల్తాఫ్ రజా, వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

చిలుకూరివారిగూడెం(మైలవరం): మైలవరం మండలం చిలుకూరివారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు తాగునీటి వాటర్ బాటిల్స్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అక్షయ ఫౌండేషన్ వేకనూరు అధినేత మాదివాడ వెంకటకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.నారాయణరావు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 40 మంది ఎంపిక

విస్సన్నపేట: ప్రముఖ ఔషధ సంస్థ హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ పీజీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 40 మంది విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు.ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.కార్యక్రమంలో వికాస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా సుధీర్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ బి.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయం

ఇబ్రహీంపట్నం: ఏపీ ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, కడప ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై విద్యార్థి సంఘాలు దాడి చేయడం అత్యంత హేయమైన చర్యఅని జాతీయ లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. సభ్యసమాజం తలదించుకునే చర్యలు విద్యార్థి సంఘాలు మానుకోవాలని హితవు పలికారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

నూజివీడు: ఇంటర్, ఐటీఐ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్వల్పకాలిక కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రధానాధికారి డి.భూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్లకు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 25 లోగా కళాశాలలో అందించాలని ప్రధానాధికారి పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళలో 08656-232711కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

శిలువగట్టు తిరునాళ్లు ప్రారంభం

నూజివీడు: పట్టణంలోని శిలువగట్టు పుణ్యక్షేత్రం వద్ద శిలువగట్టు తిరునాళ్లను మేరీమాత చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ ఎస్.డేవిడ్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. తొలుత శిలువగట్టు వద్ద పతాకావిష్కరణ చేశారు. అనంతరం నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. కార్యక్రమంలో శిలువగట్టు పుణ్యక్షేత్రం రెక్టార్ రెవరెండ్ ఫాదర్ మరియదాసు, పలువురు ఫాదర్‌లు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

ఇబ్రహీంపట్నం: శివరాత్రి పండుగ పర్వదినం పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. కృష్ణానది పరీవాహక ప్రాంత గ్రామాలైన తుమ్మలపాలెం, ఫెర్రీ, దాములూరు, జూపూడి, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు కాచవరం, కొండపల్లి ఆలయాలు నూతన శోభ సంతరించుకున్నాయి. ఆలయాలకు రంగులువేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఆలయాల్లో పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

పుణ్యస్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు

పవిత్రసంగమం వద్ద పుణ్యస్నానాలకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. స్నానఘాట్ల వద్ద డ్రెడ్జింగ్ యంత్రాలతో మెట్లు అడుగున పేరుకుపోయిన మురుగు తొలగించడంతో పుణ్యస్నానాలకు అవసరమైన స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రాంత ప్రజలతో పాటు మైలవరం, జి.కొండూరు, కంచికచర్ల, విజయవాడకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడకు వస్తారని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అంచనావేశారు. అందుకు అనుగుణంగా మహిళలు దుస్తులు మార్చుకునే టెంట్లు, బారికేడ్లు, పిండ ప్రదానం టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి బస్సులు నడిపేందుకు నిర్ణయించింది.

శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

నూజివీడు: శివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. డీఏఆర్ కళాశాల పక్కన ఉన్న కోట శివాలయం పురాతనమైనది కావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం 7 గంటలకు శివ కల్యాణం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు డీఏఆర్ కళాశాల ఆవరణలో అన్నదానం నిర్వహిస్తారు. ఆలయానికి రంగురంగుల విద్యుద్దీపాలు అలంకరించి ముస్తాబు చేశారు. బస్టాండు సమీపంలోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం కూడా శివరాత్రికి సిద్ధమైంది. ఆలయంకు విద్యుదీపాలంకరణ చేయడంతో పాటు రంగులు వేశారు. 150 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఈ శివాలయంలో శివరాత్రి రోజు తెల్లవారుజామున 4.30 గంటల నుంచి రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు రాయబారోత్సవం అనంతరం స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి ఉమాకుమార్ శివాచార్య తెలిపారు. మండలంలోని అన్నవరంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, శివ సహస్ర నామార్చన, నాగదేవత అష్టోత్తరం, శ్రీ సుబ్రహ్మణ్య సహస్ర నామార్చన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భావరాజు పుల్లారావు తెలిపారు.

విస్సన్నపేట: శివరాత్రి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శైవక్షేత్రాలను శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేశారు.రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆలయాలను అలంకరించారు. మండలంలోని కొండపర్వ గ్రామంలో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నుంచి సోమవారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక గంగా పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక ఎ.కొండూరు రోడ్డులో ఉన్న రామాలయం వద్ద శివరాత్రి ఏర్పాట్లు చేశారు. పుట్రేల గ్రామంలో ఉన్న ఉమా అఖిలేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

చాట్రాయి: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చాట్రాయిలోని మహా లింగేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు స్నానమాచరించేందుకు జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో పుష్కలంగా నీరు ఉండడంతో భక్తులు స్నానమాచరించి పిండ ప్రదానాలు చేయనున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అదే విధంగా సి.గుడిపాడు, తుమ్మగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.



తుమ్మలపాలెంలో శివరాత్రికి ముస్తాబయిన బాల కోటేశ్వర లింగాల స్వామి ఆలయం



ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం స్నానఘాట్లు మెట్ల పైన మురుగు తొలగిస్తున్న డ్రెడ్జింగ్ యంత్రం



నూజివీడు డీఏఆర్ కళాశాల పక్కన ఉన్న కోట శివాలయం

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడపగడప'

ఎమ్మెల్యే రక్షణనిధి

పుట్రేల (విస్సన్నపేట): ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరం పరిష్కరించే దిశగా కృషి చేయటానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని పుట్రేల సచివాలయం -1 పరిధిలో కోటిపల్లి, పుట్రేల గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాము గడప గడపకు వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ కారు మంచి స్వాతి, ఉప సర్పంచ్ మద్దిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గార్లపాటి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు భీమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ భూక్యా రాణి, గ్రామ, వార్డు సచివాలయాల గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

స్వామిత్వ సర్వేతో సమస్యలు పరిష్కారం

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా స్వామిత్వ సర్వేతో ఇళ్ల స్థలాలకు సంబంధించి దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారమవుతాయని ఈఓపీఆర్డీ బాబూరావు తెలిపారు. గంపలగూడెంలో స్వామిత్వ సర్వే రెండవ దశ గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో ముందుగా పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం అవగాహన గ్రామసభను సర్పంచ్ కోట పుల్లమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ సర్వేలో భాగంగా మొదటి దశ గ్రౌండ్ ట్రూతింగ్‌ను పూర్తి చేశామన్నారు. మ్యాప్‌ల ద్వారా నిర్వహించిన ఈ ప్రక్రియలో గ్రామంలో నివాస గృహాలు 2,314, ఖాళీ స్థలాలు 831 ఉన్నట్లు తెలిందన్నారు. ఆయా గృహాలు, ఇళ్ల స్థలాలకు సంబంధించి రెండవ ప్రక్రియ గ్రౌండ్ వ్యాలిడేషన్‌లో నిర్దిష్టంగా కొలతలు, యజమానుల పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. దీనికి ప్రజలు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపాల్సి ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, వీఆర్వో ప్రతాప్, గ్రామ సర్వేయర్లు విజయలక్ష్మి, గోపీనాథ్ పాల్గొన్నారు.



గంపలగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ బాబూరావు

జాతీయ క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నరసరావుపేటలో జరిగిన అండర్ 19 కేటగిరీ అంతర్ రాష్ట్ర పోటీలలో తిరువూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి పి.దీపేష్ సత్య ఏపీ జట్టు తరపున ఆడి ప్రతిభ చూపి హ్యాండ్ బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో త్వరలో జరిగే పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. అండర్ 19 వాలీబాల్ క్రీడలో ప్రథమ ఇంటర్ విద్యార్థి శశిధర్, ఇ.చందు కూడా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.



జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన తిరువూరు గురుకుల విద్యార్థులు

సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మైలవరం శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వీటిని అమలుచేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ఈ క్రమంలో పార్టీని వారికి అనుసంధానం చేసేందుకు గృహ సారథులను నియమించామన్నారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని వారికి సూచించారు. గృహ సారథుల కిట్లలో ఉన్న ప్రచార సామగ్రి గురించి, ప్రజలకు మద్దతు పుస్తకం ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ గురించి, వారి బాధ్యతల గురించి సమగ్రంగా వివరించారు. ప్రజలతో వలంటీర్లు మమేకం అవుతున్న తీరు గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల ముంగిటకు వెళ్లినప్పుడు స్వయంగా తెలుస్తోందన్నారు. మరికొద్ది రోజుల్లోనే నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు పడమట సురేష్‌బాబు, మైలవరం మార్కెట్‌యార్డు చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణి, మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, వైస్ ఎంపీపీలు చాట్ల రాబర్ట్, పాటిబండ్ల శ్రీనివాసరావు, రెడ్డిగూడెం-3 ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

పేదల సంక్షేమమే పరమావధిగా జగనన్న పథకాలు


మైలవరం: పేదల సంక్షేమమే పరమావధిగా జగనన్న పథకాలు కొనసాగుతున్నాయని, సమసమాజ స్థాపన కోసం జగనన్న అమలు చేసున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులు, గృహసారథులకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లకు జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇది ధనికులు, పేదలకు మధ్య జరుగుతున్న పోరాటం అని, పేదలకు అండగా జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని మరింతగా బలోపేతం చేయాల్సిందిగా సూచించారు. ముందుగా వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గృహసారథులకు విధి విధానాలు బాధ్యతలు వివరించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పేవన్నీ కట్టుకథలేనని, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు పడమటి సురేష్‌బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు.



మైలవరంలో గృహసారథుల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వెల్వడం(మైలవరం): ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్.నరేష్ తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలో సర్పంచ్ ధర్మరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య సేవలు ఉపయోగించుకోవాలని, పలు రోగాలకు ఎన్నో రకాల మందులు మనకు అందుబాటులో ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చేసుకోకూడదని తెలిపారు. గర్భిణులు పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. మందులతో వచ్చిన ఆరోగ్యం కంటే పోషకాహారంతో వచ్చిన ఆరోగ్యం ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సత్యవాణి, కేజియా కుమార్, సూపర్‌వైజర్ రమ, హెచ్‌ఏ ఆంజనేయులు, ఏఎన్ఎం శాంతి, ఆశ వర్కర్లు జ్యోతి, శైలజ, రమణ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



వెల్వడంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది

మార్కు మాస్టారు సేవలు చిరస్మరణీయం

ఆగిరిపల్లి: సీఎస్ఐ కౌన్సిల్ సభ్యుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొల్లూరి మార్కు సేవలు చిరస్మరణీయమని పలువురు అధికారులు అన్నారు. కొల్లూరి మార్కు సంస్మరణ సభను శుక్రవారం ఆగిరిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ మార్కు మాస్టారు సీఎస్ఐ కౌన్సిల్ సభ్యుడిగా మూడు పర్యాయాలు ఏకగ్రీవంగా ఎన్నికై దక్షిణ ఇండియా సంఘ చర్చి అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రత్నకుమార్, ఎస్ఆర్ఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జాన్‌రత్నం, పాస్టర్లు, పంచాయతీ, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది, యూటీఎఫ్, ఎస్టీయూ, డెమొక్రటిక్ పీఆర్‌టీయు నేతలు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

రెడ్డిగూడెం: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా స్థానిక గీతాంజలి హైస్కూలులో అప్సా మైలవరం డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం సైన్స్‌డే ఉత్సవాలు నిర్వహించారు. సైన్స్ ప్రదర్శనలో మొదటి బహుమతి ఎస్.రమశ్రీ, ఎస్ఎస్‌కే స్కూలు, మైలవరం, రెండవ బహుమతి ఎం.లోకనాథ్, వివేకానంద హైస్కూలు, జి.కొండూరు, మూడవ బహుమతి ఎస్కే షహీనా వివేకానంద హైస్కూలు జి. కొండూరు, కన్సొలేషన్ బహుమతి రాజశేఖర్ వివేకానంద హైస్కూలు మైలవరం గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో రఘురాం, కె.శ్రీనివాస్, అప్సా జిల్లా అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, డివిజన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, రెడ్డిగూడెం హెచ్ఎం దామోదరరెడ్డి, గీతాంజలి హైస్కూలు కోటిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వివిధ స్కూల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిగా శ్రావ్యపూర్ణిమ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పట్టణ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిగా కంతం శ్రావ్య పూర్ణిమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొండపల్లికి చెందిన ఈమె ఉత్తరప్రదేశ్ లక్నో రామమనోహర లోహియా అవధి యూనివర్సిటీలో 2022లో ఎంబీబీఎస్ పూర్తిచేసింది. పీజీకి సిద్ధమవుతున్న తరుణంలో స్థానిక యూపీహెచ్‌సీలో వైద్యాధికారిగా పోస్టింగ్ రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. శ్రావ్య తండ్రి ప్రసాద్ స్థానిక టాలెంట్ స్కూల్ యజమాని. తల్లి ఆండాళ్లు హెచ్ఎంగా పనిచేస్తుంది.

డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



వెల్వడం(మైలవరం): డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలో ప్రవాసాంధ్రుడు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి పేదలకు వస్త్రదానంతో పాటు తన సొంత నిధులతో పింఛన్లు చెల్లిస్తున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ హనిమిరెడ్డి విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడారు. స్థానిక భాస్కర నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లకిరెడ్డి బాలిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో లకిరెడ్డి సోదరులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికేషన్



మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎ.శివయ్య, సంస్థ ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం కళాశాలలో సదుపాయాలు బాగున్నాయని ప్రశంసించారు. ప్రతిదానికి క్వాలిటీ చెకింగ్ ఉంటుందని, కానీ విద్యకు అలాంటి క్వాలిటీ అసెస్‌మెంట్ చేయాలనే ఉద్దేశంతో పుట్టిందే ఐఎస్ఓ సర్టిఫికేషన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారి ఈ సర్టిఫికేషన్ పొందిన కళాశాల మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అన్నారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తునికిపాడు(గంపలగూడెం): పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గంపలగూడెం మండలం తునికిపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వి.సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామావత్తు లక్ష్మణ్(42) ఘటనలో మృతి చెందాడు. దీర్ఘకాలంగా తాగుడుకు బానిసైన లక్ష్మణ్ కొంతకాలంగా అనారోగ్యంగా ఉంటున్నాడు. ఈ పరిస్థితుల్లో మనస్తాపానికి గురైన లక్ష్మణ్ ఇంటి వద్ద పురుగుమందు తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు వెంటనే అతన్ని చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.





